దిన పత్రిక
తొలి సమయం
మంగళవారం , 31 - 3 -2026

## అలీన విధానం అమలులో మోడీ విఫలం: బాల నరసింహ



**తొలి సమయం, వనపర్తి; మార్చి, 30.**

అమెరికా ఇజ్రాయిల్-ఇరాన్ యుద్ధ విరమణకు చొరవ చూపటల్లో దేశ ప్రధాని మోదీ విఫలమయ్యారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాల నరసింహ విమర్శించారు. ఆదివారం రాబర్ట్ అధ్యక్షతన జరిగిన వనపర్తి జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వాలు దేశాల మధ్య యుద్ధాలు వచ్చినప్పుడు భారతదేశ అలీన విధానం పాటించి యుద్ధ నివారణకు చొరవ చూపారని మోదీ విషయంలో అది లోపించిందన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తనకు అప్పుడు అని మోడీ గొప్పలు చెప్పడం తప్ప యుద్ధంతో ఇండియాకు జరిగే నష్టాన్ని వివరించి రాజీతో యుద్ధ విరమణ చేయించలేకపోయారన్నారు. ఇరాన్, క్యూబా, వెనుజుల దేశాలను ఆక్రమించాలనే ట్రంప్ సామ్రాజ్యవాద రాజ్య విస్తరణ కాంక్ష ప్రజా వినాశనం కలిగించే యుద్ధాలకు కారణమన్నారు. ఇరాన్ దేశంలో 30% చమురు నిల్వలు ఉన్నాయని వాటిని కొండగొట్టేందుకు ఇరాన్ వద్ద యురేనియం అనుబాంబులు ఉన్నాయని వాటితో తమకు ప్రమాదమని ప్రపంచాన్ని తప్పుదారి పట్టించి యుద్ధానికి దిగారు అన్నారు. ఫలితంగా భారతదేశంలో డీజిల్ పెట్రోల్ గ్యాస్ కొరత కు దారి తీసింది అన్నారు. మోడీ మౌనం దేశానికి తీరని నష్టమన్నారు. ఇరాన్ , ఇరాన్ మద్దతు దేశాల వద్ద ఆయుధ సంపత్తి ఉందని ఎంతకాలం యుద్ధం జరుగుతుందో చెప్పలేమని దేశంలో ఎన్ని సమస్యలు వస్తాయో అంతు పట్టడం లేదన్నారు. యుద్ధం తక్షణ ఆపేందుకు భారతదేశం తన వంతు పాత్రను పోషించాలన్నారు. దేశంలో పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ కొరత ఫలితంగా ఇతర వస్తువుల ధరలు పెరిగి సామాన్యుడు జీవించలేని పరిస్థితి ఏర్పడబోతోందని సమస్యల పరిష్కారానికి తగు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అరకొరగా అమలు చేస్తుందన్నారు. చాలామంది అర్హులకు రెండు లక్షల రుణమాఫీ కాలేదని, రైతు భరోసా నిధులు పూర్తిస్థాయిలో రైతు ఖాతాల్లో జమ కాలేదని, రైతు బీమా పథకానికి నిధులు కేటాయించలేదని మహిళలకు నెలకు రూ. 2500 ఇవ్వలేదన్నారు. ఆసరా పింఛన్లు రూ. 2000 నుంచి 4 వేలకు పెంచలేదని, ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయలేదన్నారు. హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ మున్సిపల్ ఎన్నికల్లోను కాంగ్రెస్ మిత్ర ధర్మం పాటించలేదని విమర్శించారు. రానున్న జడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికల్లో సొంతంగా పోటీకి సిద్ధం కావాలని కోరారు. ఏప్రిల్ ఒకటి నుంచి పది వరకు ఇంటింటికి సిపిఐ ప్రోగ్రాం ఉందని ఇళ్లకు వెళ్లి సమస్యలు తెలుసుకొని పరిష్కారం కోసం నేతలు కార్యకర్తలు పని చేయాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, చంద్రయ్య, రాబర్ట్, రమేష్, మోష,భాస్కర్,రవీందర్, కురుమయ్య,అబ్రహం, కుతుబ్, బాలరాజు పాల్గొన్నారు.

## మానుకోటలో ఆదివాసీల అంతిమ సాంస్కృతిక ధర్మయుద్ధం భారీ బహిరంగ సభకు ఆదివాసి 9 తెగల జేపీసీ రూపకల్పన

- మానుకోట జిల్లాలో ఆదివాసీ 9 తెగల ఉద్యమ కార్యాచరణను అడ్డుకోవడంలో భాగంగానే ఉద్యమ యువ నాయకుడు, తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డా. మైపతి అరుణ్ కుమార్ అరెస్ట్ అని ఆరోపిస్తున్న ఆదివాసి 9 తెగల జేపీసీ..ఉద్యమ నిర్మాణం, ఉద్యమ నాయకుల అరెస్టుకు నిరసనతో పాటు , చట్ట బద్ధత లేని లంబాడీలను జాబితా నుండి తొలగించే కార్యచరణలో భాగంగానే ఈ రోజు కట్టుగూడెం గ్రామం, ఇల్లందు మండలంలో, వచ్చే జూన్ మొదటి వారంలో మానుకోటలో ఆదివాసీల అంతిమ సాంస్కృతిక ధర్మయుద్ధం భారీ బహిరంగ సభకు తీర్మాణం చేసిన ఖమ్మం,వరంగల్ జిల్లాల రిటైర్డ్ ఉద్యోగుల నాయకుల మేధోమధన సమీక్ష సమావేశం
- ఆదివాసి 9 తెగల జెఎసి రాష్ట్ర చైర్మన్ చుంచు రామకృష్ణ





**తొలి సమయం, డెస్క్ హైదరాబాద్ మార్చ్ 29 :**

తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు ఆదివాసీ ఉద్యమ నాయకులు మైపతి అరుణ్ కుమార్ ను ఈ నెలలో రెండు సార్లు అప్రజా స్వామిక, అక్రమ అరెస్టు లను ఖండిస్తూ.. ఆదివాసి 9 తెగల జాక్ చైర్మన్ చుంచు రామకృష్ణ నిప్పులు చెరిగారు భద్రాచలం ధర్మ యుద్ధ మహాసభ విజయవంతం అయిన తర్వాత మేడారం జాతరలో మహాసభకు ప్రకటన చేసి యుంటిమి, కానీ కొన్ని ప్రతికూల పరిస్థితుల కారణంగా ఆ సభను మానుకోటలోనే నిర్వహించాలని నేటి ఖమ్మం, వరంగల్ జిల్లాల రిటైర్డ్ ఉద్యోగుల మేధోమధన సమావేశంలో చర్చించడమైనది. త్వరలో వరంగల్ రిటైర్డ్, ప్రస్తుత ఉద్యోగస్తులతో, ఆదిలాబాద్ జిల్లాలోని రిటైర్డ్ ఉద్యోగస్తులు, ఉద్యోగస్తులు,రాయి సెంటర్ పెద్దలతో కేస్లాపూర్ లో చర్చించిన తర్వాత , అన్ని డిపార్ట్మెంట్ ఉద్యోగస్తులతో, విద్యార్థులతో,మహిళలతో , తెగల పెద్దలతో పాటు కలిసి వచ్చే అన్ని సంఘాల నాయకులతో చర్చించి తుది నిర్ణయాన్ని ఏప్రిల్ నెలాఖరులో నిర్వహించే సమావేశంలో ఆదివాసీ 9 తెగల సాంస్కృతిక ర్యాలీ మరియు బహిరంగసభ తేదీని ప్రకటిస్తామని జాక్ చైర్మన్ చుంచు రామకృష్ణ అన్నారు..భవిష్యత్తు ఉద్యమ కార్యచరణలో భాగంగా ఈ రోజు ఇల్లందు మండలం కట్టుగూడెం గ్రామంలో ఖమ్మం, వరంగల్ జిల్లాల రిటైర్డ్ ఉద్యోగుల ముఖ్యులతో మేధోమథన సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమీక్ష సమావేశంలో పలువురు రిటైర్డ్ ఉద్యోగులతో పాటు, జాక్ చైర్మన్ చుంచు రామకృష్ణ మాట్లాడుతూ.... లంబాడాలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలనే ఉద్యమంలో , ఆధార్ సొసైటీ ఆద్వర్యంలో చేస్తున్న న్యాయపోరాటంలో భాగంగా గత కొన్ని సంవత్సరాల నుండి అత్యున్నత గౌరవ సుప్రీంకోర్టు వేదికగా పోరాడుతున్నామని, అందుకు అన్ని రకాల ఆధారాలు ఉన్నాయని అన్నారు, ఓటు బ్యాంకు ను ముందు పెట్టి అన్ని పార్టీలను బ్లాక్ మెయిల్ చేస్తూ ఆదివాసీల న్యాయమైన ఉద్యమ ఆకాంక్షను నీరు కార్చాలని గోర్ బంజారాలు ఆదివాసీ ఉద్యమ నాయకులను అక్రమ అరెస్టుల రూపంలో భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, అందులో భాగంగానే ఇటీవల తుడుండెబ్బ మహబూబాబాద్ జిల్లా కమిటీను వేయడానికి వస్తున్న డా. మైపతి అరుణ్ కుమార్ ను కురవి మండల కేంద్రం కు రానివ్వకుండ, ఆరోజు ఉదయం ములుగు జిల్లా పస్రాలో అరెస్టు చేశారన్నారు.. ఆ సంఘటనను యావత్ ఆదివాసీ సమాజం ఖండించినా వాళ్ళ వైఖరిలో మార్పు రాలేదు సరికదా, నేడు వారికున్న రాజకీయ బలంతో నేడు మార్చి 29 రోజున మానుకోట జిల్లా పెద్ద గూడూరులో జిల్లా కమిటీ వేయడంలో భాగంగా వస్తున్న ఉద్యమ నాయకులు అరుణ్ కుమార్ ను రెండవసారి బయ్యారం మండలంలో అరెస్టు చేశారన్నారు.. అయితే మానుకోట జిల్లా గోర్ బంజారాల సొంత రాజ్యంలా భావిస్తున్న గోర్ బంజారాలు నేడు అధికార బలంతో ,పోలీస్ వ్యవస్థను అడ్డుపెట్టుకుని తుడుండెబ్బ రాష్ట్ర అధ్యక్షుణ్ణి రెండు సార్లు అరెస్టు చేయడాన్ని ఆదివాసీ 9 తెగల జేపీసీ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు.. ఈ అరెస్టు నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, అదే విధంగా గోర్బంజరాలను తొలగించకుండా, కాయిత మధుర లంబాడీలను, బోయ వాల్మీకులను జాబితాలో చేర్చడానికి చేస్తున్న రాజకీయ కుట్రలను అడ్డుకోవడానికి మేడారం లో జూన్ నెల మొదటి వారంలో నిర్వహించాలనుకునే మహాసభను, మానుకోటలో లక్ష మంది ఆదివాసీ తెగల ప్రజలతో జరుపతల పెట్టామని అన్నారు, త్వరలో జాతి ప్రయోజనాల కోసం పోరాడే అన్ని సంఘాల్లోని నాయకులు , తెగల ముఖ్యులతో చర్చించిన తర్వాత మానుకోట లో నిర్వహించబోయే ఆదివాసి తెగల అంతిమ సాంస్కృతిక ధర్మ యుద్ధ మహాసభకు ప్రకటన చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధార్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ కల్తీ వీరమల్లు గారు, ప్రొఫెసర్ డాక్టర్ ఈసం సారయ్య దొర, రిటైర్డ్ ఏఎస్పి, కురుసం సీతారాములు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ కొమురం ప్రసాద్, రిటైర్డ్ అధికారులు చీమల సూర్య నారాయణ , జారే భిక్షం , చుంచ పాపయ్య , సుంచ లక్ష్మీనారాయణ టీచర్, ఆలూరి సమ్మయ్య టీచర్, సిద్ధబోయిన వీరస్వామి రెవెన్యూ సూపరింటెండెంట్,సిద్ధబోయిన బాబు రావు సర్వే ఆఫ్ ఇండియా, కొమురం కనకయ్య టీచర్ లతో పాటి ఇల్లందు ప్రాంత తుడుం దెబ్బ నాయకులు మోకాళ్ళ సతీష్, పోలెబోయిన రామనర్సయ్య, తాటి వెంకటేశ్వర్లు, చింత జోగయ్య, ఖమ్మం విద్యార్థి నాయకులు బట్ట శ్రీకాంత్, చింతా నందు తదితరులు పాల్గొన్నారు

# సింగరేణి హెడ్డాఫీస్ ముట్టడి ఉద్రిక్తత

**సిపిఐ నేతలు నారాయణ, సాబీర్ పాషా, యూనియన్ నాయకులు వాసిరెడ్డి, రాజ్ కుమార్ అరెస్టు**

**సింగరేణి సిరిని దోచుకుంటున్న కేంద్ర, రాష్ట్ర పాలకులు**

**డిమాండ్లు నెరవేర్చకపోతే సమ్మె సైరన్ మోగిస్తాం**

**సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె. నారాయణ**






**తొలిసమయం, కొత్తగూడెం, మార్చి 30 :**

సింగరేణి పరిరక్షణ, కార్మికుల సమస్యల పరిస్కారం కోరుతూ వర్కర్స్ యూనియన్ చేపట్టిన సింగరేణి హెడ్డాఫీస్ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. కోల్ బెల్ట్ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన వేలాది మంది కార్మికులు, యూనియన్ కార్యకర్తలు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు, హెడ్డాఫీసు చేరుకొని ప్రధాన ద్వారం ఎదుట బైటాయించి ధర్నా చేశారు. పొర్లు దండాలతో వినూత్న రీతీలో నిరసన వ్యక్తం చేశారు. మూడు గంటలపాటు ధర్నా చేపట్టడంతో పోలీసులు అడ్డుకోవడంతో నేతలకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వివాదం, తోపులాట చోటుచేసుకోవడంతో హెడ్డాఫీసు ఏరియా ఉద్రిక్తంగా మారింది. సిపిఐ జాతీయ నాయకులు డాక్టర్ కె నారాయణ, జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషాతోపాటు యూనియన్ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ తదితరులను పోలీసులు నిర్బంధించి 1 టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టులకు ముందు కార్మికులనుద్దేశించి సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె. నారాయణ మాట్లాడారు. సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సిన రూ. 50 వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని, దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించాలనీ, ఆ నిధులను ఎప్పుడు విడుదల చేస్తారో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త గనుల ప్రారంభంపై యాజమాన్యం చూపుతున్న నిర్లక్ష్యం సంస్థ మనుగడకే ముప్పు అని, ఏసీబీ విచారణ సాకుతో మెడికల్ బోర్డును నిలిపివేయడం కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడటమేనని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి సిరిని దోచుకుంటున్నాయని ధ్వజమెత్తారు. కార్మికుల కష్టంతో మనగడ సాగిస్తున్న సింగరేణి సంస్థ కార్మికులను నట్టేట ముంచేందుకు ప్రయత్నిస్తుందని, ఇందులో మితిమీరిన రాజకీయ జోక్యమే కారణం అన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుంటే రాబోయే రోజుల్లో మరిన్ని గట్టి పోరాటాలు నిర్వహిస్తామని, అవసరమైతే సింగరేణి కార్యాలయాలను స్వాధీనం చేసుకొని తమ సత్తా చాటుతామని చెప్పారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు, సొంత ఇంటి పథకం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. క్లర్క్ పోస్టులకు కోర్టు కేసులతో సంబంధం లేకుండా పరీక్షలు జరపాలని, 350 మంది డిపెండెంట్లకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. సహజ మరణం పొందిన కార్మికుల కుటుంబాలకు రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. సింగరేణి ఏరియాలో కాంగ్రెస్కు ఓట్లు పడ్డాయి అంటే అది కేవలం సింగరేణి కార్మికుల వల్లే అనీ, కోరి తెచ్చుకున్న ప్రభుత్వం కార్మికుల నెత్తిన చెయ్యి పెడుతుందని మండిపడ్డారు. సాక్షాత్తు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మెడికల్ బోర్డు వల్ల సింగరేణికి భారీ ఆర్థిక నష్టం వాటిల్లుతుందని ప్రకటించటం దుర్మార్గమని, కార్మిక సంక్షేమం కోసం ఆలోచన చేయాల్సిన పాలకులు లేనిపోని మాటలతో కార్మికులను మనస్థాపానికి గురి చేయటం మంచిది కాదని హితవు పలికారు. కొత్త గనులు ఏర్పాటు చేసే క్రమంలో ప్రైవేటు పెత్తనానికి స్వస్తి చెప్పి సింగరేణి కార్మికులతోనే బొగ్గు ఉత్పత్తిని చేయాలని, పాత పద్ధతిలోనే మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, కోరిమి రాజ్ కుమార్ మాట్లాడుతూ అసెంబ్లీలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కార్మికుల గొంతుకగా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ డిమాండ్లు నెరవేర్చకుంటే సింగరేణి వ్యాప్తంగా సమ్మె సైరన్ మోగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, నాయకులు మిర్యాల రంగయ్య, కె సారయ్య, వీరభద్రం, వైవి రావు, ముస్కె సమ్మయ్య, వంగ వెంకట్, జి వీరాస్వామి, ఎస్ వి రమణమూర్తి, వి మల్లికార్జున్ రావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నరాటి ప్రసాద్, కంచర్ల జమలయ్య తదితరులు పాల్గొన్నారు.



